23

# శిష్యప్రేమికుడు శ్రీశేషుదేవులు

శ్రీ శేషుబాబు గారు విశ్వవ్యాప్తమైయుండి సర్వసృష్టికీ మూలమైయున్న శక్తినే సత్యముగా ఎంచి ఆరాధించినారు. అట్టి సత్యమునకు ఆకార రూపముగా అవతార పురుషులలో ఒక్కరగు శ్రీ యేసుప్రభువు రూపమును ఎంచుకుని గురువుగా ఆరాధించినారు. అట్టి తన గురువగు సత్యమునకు చేయు గురుసేవాకర్మగా సత్యబోధను ఎంచినారు. అందుచేతనే తన జీవితకాలమంతా సత్యబోధకర్మను ఏనాడూ అణుమాత్రమైనా విస్మరించక ఆ కర్మలో ఏ మాత్రము రాజీపడకుండా సత్యబోధను ప్రతి క్షణము శిరస్సుపై ధరించియే జీవించినారు. సత్యబోధను భగవంతునితో సమానముగా ప్రేమించినారు. నిద్రాహారములను, లాభనష్టములను, ప్రాణమును కూడా లెక్క చేయకుండా సత్యబోధను ప్రేమించినారు. శ్రీ గురుదేవుల జీవిత మంతటిలో ఆకారముగా సత్యబోధతో సమానముగా మరి దేనికీ విలువనివ్వలేదు. సత్యబోధ తదుపరి స్థానములో శ్రీ శేషుబాబు గారు అత్యంత ప్రాముఖ్యతతో విలువనిచ్చి ప్రేమించినది సత్సంగమును, శిష్యులను అయియున్నది. నిరాకారముగా సత్యమునకు, ప్రభువుకు ఎంతగా విలువనిచ్చి ప్రేమించినారో, ఆకారముగా సత్యబోధకు, సత్సంగపు శిష్యులకు అంతగా విలువనిచ్చి, ప్రేమించి, సేవ చేస్తూ రక్షించినారు.

శ్రీ గురుదేవులు సత్సంగమును శిష్యులను తన గురువగు సత్యమునకు ప్రతిరూపముగా భావించెడివారు. శిష్యులను సంపూర్ణముగా ప్రేమించుటయే కాదు సంపూర్ణముగా అభిమానించెడివారు, గౌరవించెడివారు, సేవ చేసెడివారు కూడా. తాను గురువునని, శిష్యులు తన సేవకులనే భావము ఏనాడూ ఆయనలో కలుగలేదు. సంఘములో అందరికంటే తానే చిట్టచివరి వాడినని, సంఘ సభ్యులందరూ తనకంటే పెద్దవారేననే భావము ఆయనలో సంపూర్ణముగా ముద్రపడిపోయి ఉండేది. పైకి గురువువలె పెద్దవానివలె మాట్లాడుచున్నప్పటికీ, ఆయన అంతరంగము ఎల్లప్పుడూ వినయముతోను, ఆప్యాయతతోను నిండియుండేది. సత్సంగము కొరకు శిష్యుల కొరకు తనకున్న బాహ్యసంపదలన్నింటినీ క్షణమైనా ఆలోచించకుండా ఖర్చు చేసేయగలిగినట్టి ఏకైక, ప్రధమ సత్సంగ సభ్యుడు శ్రీ శేషుబాబుగారే అని ఖచ్చితముగా చెప్పగలను. శిష్యులమైన మాలో ఆయనను సంపూర్ణముగా ప్రేమించగలిగిన వారమెవ్వరమూ లేము. ఆయన మాత్రము తనగురువగు సత్యమును ఎంతగా ప్రేమించాలో అంతగా శిష్యులైన ప్రతి ఒక్కరినీ పరిపూర్ణముగా ప్రేమించినారు. శిష్యుల కొరకు తన ధనమును, కీర్తిని,

continue...

కుటుంబమును, ప్రాణమును కూడా తృణప్రాయముగా త్యాగము చేసేయుటకు అనుక్షణము సిద్ధముగా ఉండునంతటి పరిపూర్ణమైన ప్రేమతో ఆయన హృదయము ఎల్లప్పుడు నిండియుండేది.

**గురుర్బ్రహ్మః, గురుర్విష్ణుః, గురుదేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మః, తస్మైశ్రీ గురవేనమః**

అంటూ దైవగ్రంథములలో శిష్యుడు గురువును ఏ విధముగా ప్రేమించాలని తెలియచేసియున్నారో ఆ విధముగా శ్రీ గురుదేవులు శిష్యులను ప్రేమించెడివారు.

ఎల్లప్పుడూ శిష్యుల క్షేమమును గూర్చియే ఆలోచించెడివారు. తనకున్న సంపదలన్నింటికీ తాను ధర్మకర్తను మాత్రమేనని, అసలైన హక్కుదారుడు తన గురువగు భగవంతుడేనని ఆ గురువుకు ప్రతిరూపముగా తాను భావించే సత్సంగము కొరకే ఆ ధనాన్ని వినియోగించాలని భావించెడివారు.

తాను సంసారములో ఉండి కూడా కుటుంబమును మించి సత్సంగమునకే ప్రాధాన్యమిచ్చినారు. కుటుంబమును, ఇంటిని సత్సంగసేవ కొరకే ఉపయోగింప చేసినారు. తనదైన సమస్తాన్నీ సత్యసేవలో, సంఘ సేవలో ఉపయోగించి సత్సంగము కొరకు అరక్షణమైనా ఆలోచించకుండా సమస్తాన్నీ ఖర్చు చేసేసిన త్యాగమూర్తి శ్రీ శేషుబాబుగారు. సత్సంగచరిత్రలో సత్సంగము కొరకు సమస్తాన్నీ ధైర్యముగా త్యాగము చేయగలుగుటలో ప్రథమ స్థానము శ్రీ శేషుబాబుగారిదే అయియున్నది.

ఆయన సత్వగుణప్రధానుడైనప్పటికీ సత్యమార్గంలోనికి మారగానే ఆయన ప్రాధాన్యత మారిపోయినది. సత్వగుణముకన్నా, నీతికన్నా సత్యమే గొప్పదని నమ్మినారు. కావుననే శ్రీ గాయత్రిమాత సేవవలన తనకు లభించిన సంపాదనను తండ్రికి ఈయకుండా తనతో సత్యబంధము కలిగియున్న శిష్యులకే పూర్తిగా ఖర్చు పెట్టేసేవారు. సత్సంగములో మొట్టమొదటగా ధనమును సంపాదించినదియు, లోకాన్ని లెక్క చేయకుండా ధైర్యముగా దానిని సంఘము కొరకు పూర్తిగా వినియోగించినదియు శ్రీ శేషుబాబుగారే అయియున్నారు.

continue..

శ్రీ గురుదేవులు సంఘము కొరకు ఉపయోగపడే ధనము మాత్రమే విలువైనదని భావించెడివారు. సంఘ కార్యక్రమములకు, శిష్యులు భక్తి సినిమాలు చూచుటకు, భక్తి గ్రంథములు కొని చదువుటకు ధనాన్ని వినియోగించేవారు. ప్రతి శిష్యుడిని ఎంతో మమకారముతో ప్రేమగా చూచెడివారు. బయటి నుండి వచ్చేటప్పుడు స్వీట్సు, ఫ్రూట్స్ వంటివి తెచ్చి శిష్యులకిచ్చి వారు తింటుంటే ఆయన ఆనందించెడివారు. శిష్యులలో ఎవరికి ఆపద వచ్చినా వారి కొరకు ధనమును ఖర్చు పెట్టుటకు శ్రీ గురుదేవులు సంసిద్ధులైయుండేవారు.

శ్రీ గురుదేవులు శిష్యులను అందరికంటే అత్యధికముగా ప్రేమించెడివారు. శిష్యులలో ఎవ్వరైతే సమస్తాన్నీ వదులుకుని సత్యమునే సంపూర్ణముగా నమ్ముకుని జీవించుచుంటారో వారిని మరింతగా ప్రాణాధికముగా ప్రేమించెడివారు. లౌకికులు లోకములోని తమ ప్రియతమ బంధాలను ఎంతగా ప్రేమిస్తారో అంతకు వందరెట్లు ఎక్కువగా ఆయన శిష్యులను ప్రేమించేవారు.

ఎంతటి క్లిష్టపరిస్థితిలోనైనా సరే సత్సంగమునే అధికముగా ప్రేమిస్తూ, సంఘ శ్రేయస్సుకే ఆలోచిస్తూ పాటుపడే ఆయనకున్న శిష్యవాత్సల్యాన్ని వ్రాయటానికి కొలవటానికి ఎవ్వరూ సరిపోరు. ఆ వాత్సల్యమూర్తి ప్రేమను స్మరించుకుని తరించుటకు అతి స్వల్ప విషయాలను మాత్రమే ఇక్కడ ఉదహరించుట జరిగినది. శ్రీ గురుదేవుల శిష్యప్రేమ, వాత్సల్యములు అనంతములు.

